క్లుప్తంగా

అప్పుల బాధతో కౌలు రైతు ఆత్మహత్య

మేదరమెట్ల: అప్పుల బాధతో పురుగు మందుతాగి కౌలు రైతు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈఘటన మండల కేంద్రంలో ఆదివారం చోటుచేసుకుంది. మృతుడి భార్య అంజమ్మ ఫిర్యాదు మేరకు ఎస్సై ఎం.వెంకటేశ్వరరావు వివరాల మేరకు.. మండలంలోని పమిడి పంచాయితీ పరిధిలోని కనగాలవారిపాలేనికి చెందిన కనగాల శ్రీనివాసరావు (56) గ్రామంలో సుమారు 20 ఎకరాలను పొలాన్ని కౌలుకు తీసుకుని మిర్చి పంట వేశాడు. పంట సరిగా చేతికిరాకపోవటంతో సుమారు రూ. 50 లక్షల వరకు అప్పుల పాలయ్యాడు. అప్పుల బాధ తట్టుకోలేక ఆదివారం ఇంట్లో ఎవరూలేని సమయంలో పురుగుల మందుతాగి అపస్మారకస్థితిలో పడి ఉన్నాడు. కుటుంబ సభ్యులు గమనించి రావినూతలలోని ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. వైద్యులు పరిక్షించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు.

గుండెపోటుతో ఉపాధ్యాయుడు మృతి


మన్నం అంకయ్య (ఫైల్)

అద్దంకి రూరల్: మండలంలోని ఉప్పలపాడు ప్రాథమికోన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న మన్నం అంకయ్య (60) ఆదివారం ఒంగోలు కిమ్స్ వైద్యశాలలో గుండెపోటుతో మృతి చెందారు. ఆయన మృతికి ఎంఈవో పీవీ రాఘవరావు నివాళులర్పించి వారి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

తిరుమలకు తరలిన మార్టూరు కూరగాయలు


వాహనానికి పూజలు నిర్వహిస్తున్న స్థానికులు

మార్టూరు: స్థానిక కూరగాయల మార్కెట్ నుంచి తిరుమలకు అన్నదానం నిమిత్తం కూరగాయలు ఆదివారం ఉదయం తరలి వెళ్లాయి. తిరుమలలోని అన్న ప్రసాద నిమిత్తం మార్టూరు కూరగాయలు పంపాలని వచ్చిన ఆదేశాల మేరకు తిరుమల నుంచి వచ్చిన టీటీడీ ప్రత్యేక వాహనంలో కూరగాయలు నింపిన వర్తకులు రైతులు స్థానిక స్టేట్ బ్యాంక్ సెంటర్‌లో పండితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా టీటీడీ వాహనంలో తీసుకువచ్చిన శ్రీవారి లడ్డు ప్రసాదాన్ని భక్తులకు పంచి పెట్టారు. అనంతరం వాహనం ఊరి వెలుపల వరకు సాగనంపారు.

జూదరుల అరెస్టు

పర్చూరు: పేకాట శిబిరంపై పోలీసులు దాడులు చేశారు. పర్చూరు మండలం ఉప్పుటూరు గ్రామంలో ఆదివారం సాయంత్రం పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో ఎస్సై ఎన్ ప్రసాద్ తన సిబ్బందితో కలిసి దాడి చేశారు. ఇందులో నలుగురుని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ. 21950 సీజ్ చేసి వారిపై కేసు నమోదు చేశారు.

నేడు కారంచేడులో స్పందన

కారంచేడు: ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన స్పందన కార్యక్రమాన్ని సోమవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో నిర్వహిస్తామని ఇన్‌చార్జ్ తహసీల్దారు పీ సుశీలాదేవి తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన ప్రజలు, రైతులు, విద్యార్థులు తమ అవసరాలపై అర్జీలు పెట్టుకోవచ్చన్నారు. అన్ని శాఖల అధికారులు, సిబ్బంది తప్పకుండా హాజరుకావాలని ఆమె కోరారు. హాజరుకాని అధికారులపై శాఖాపరమైన చర్యలుంటాయని ఆమె చెప్పారు.

శింగరకొండ దర్శిని


అలంకరణలో ప్రసన్నాంజనేయ స్వామి మూల విరాట్టు

అద్దంకి: శుభకృత్ నామ సంవత్సరం. ఉత్తరాయణం మాఘ మాసం ఆశ్లేష నక్షత్రం పాడ్యమి సందర్భంగా సోమవారం ప్రత్యేక పూజలు చేస్తారని శింగరకొండ దేవస్థాన ఏసీ సుభద్ర ఆదివారం తెలిపారు. ఉదయం 5గంటలకు సుప్రభాత సేవ, 5.30 గంటలకు బిందె తీర్థం. మధ్యాహ్నం 1.00 గంట నుంచి 1.30 గంట వరకు పంచ హారతుల పూజ నిర్వహిస్తారు. ప్రసన్నాంజనేయ స్వామి ఉత్సవ మూర్తులకు పల్లకీ సేవ నిర్వహిస్తారు. రాత్రి 7 గంటల నుంచి 7.45 గంటల వరకు జరిగే ప్రదోషకాలార్చన అనంతరం ఆలయం మూసివేస్తారు.

ప్రజల అభిమానంతో మళ్లీ అధికారం

● రాష్ట్ర శాప్‌నెట్ చైర్మన్ కృష్ణచైతన్య


లబ్ధిదారులతో మాట్లాడుతున్న శాప్‌నెట్ చైర్మన్ చైతన్య

అద్దంకి: సీఎం జగన్ మోహన్‌రెడ్డి చేస్తున్న అభివృద్ధే అండగా నిలిచి మరలా అధికారంలోకి వచ్చేలా చేస్తుందని రాష్ట్ర శాప్‌నెట్ చైర్మన్, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బాచిన కృష్ణచైతన్య అన్నారు. ఆయన ఆదివారం మండలంలోని గుర్రంవారిపాలెం గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమాన్ని నాయకులు, కార్యకర్తలతో కలిసి నిర్వహించారు. గ్రామంలో సమస్యలు తెలుసుకుంటూ, యువకులు, వృద్ధులను పలకరించి వారి క్షేమ సమాచారాలు తెలుసుకుంటూ ముందుకు సాగారు. ఆయా గృహాల వారికి పథకాల ద్వారా అందిన లబ్ధి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా చైతన్య మాట్లాడుతూ గ్రామాల్లో ఏ సమస్య ఉన్నా అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని చెప్పారు. సచివాలయంలోనే వివిధ శాలకు చెందిన అధికారులు ఉంటారన్నారు. వలంటీర్ల ద్వారా అధికారులకు సమస్యను తెలియజేస్తే పరిష్కారం అవుతుందన్నారు. పరిష్కారం అయ్యే సమస్యలు వెంటనే అవుతాయని, కొన్ని సమయం పట్టే సమస్యలు వెంటనే కావని చెప్పారు. ప్రజలు ఆ విషయాన్ని తెలుసుకోవాలన్నారు. వ్యవసాయం దగ్గర నుంచి ఎరువులు, పురుగు మందులు, విత్తనాలు గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాల్లో లభించేలా సీఎం జగన్ ఏర్పాటు చేశారని చెప్పారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకుని ఎదగాలన్నారు. జగనన్న కాలనీల్లో ఇల్లు మంజూరైన వారు వెంటనే కట్టుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు, సర్పంచులు, స్థానిక నాయకులు, కార్యకర్తలు, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

అంకమ్మతల్లి దేవాలయంలో చైతన్య పూజలు..

మేదరమెట్ల: మండలంలోని అనమనమూరు గ్రామంలోని అంకమ్మ తల్లి దేవాలయంలో రాష్ట్ర శాప్‌నెట్ చైర్మన్, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బాచిన కృష్ణ చైతన్య ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. పూజల్లో చైతన్యతోపాటు, మాజీ ఎమ్మెల్యే వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు డాక్టర్ బాచిన చెంచుగరటయ్య ఉన్నారు. చైతన్య ఆలయ అర్చకులు స్వాగతం పలికి ప్రత్యేక పూజలు చేశారు.

రథం నిర్మాణానికి శంకుస్థాపన


శంకుస్థాపన చేస్తున్న కరణం వెంకటేష్

చీరాల: పేరాల పెద్ద రథం అంటే చాలా చరిత్ర కలిగినది. అయితే రథం శిథిలమైంది. అప్పటి నుంచి చీరాలలో రథోత్సవం జరగడం లేదు. చాలా కాలం తరువాత నూతన రథం నిర్మాణానికి దేవస్థానం కమిటీ నిర్ణయించింది. ఆదివారం భద్రావతి సమేత భావనారుషి దేవస్థానం అవరణలో నూతన రథం నిర్మాణానికి వైఎస్ఆర్ సీపీ నియోజకవర్గ ఇంచార్జ్ కరణం వెంకటేష్ ముఖ్యఅతిథిగా పాల్గొని శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చీరాల చరిత్రలో పెద్ద రథం విశిష్టత చాలా గొప్పదన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు, కమిటీ చైర్మన్ గోలి శ్రీనివాసరావు, అన్నదాత పాండురంగారావు, పలమర్తి రాజేంద్రప్రసాద్, గోలి ప్రసాద్, గోలి రవి, తదితరులు పాల్గొన్నారు.

సమాజ శ్రేయస్సు కోసం పూజలు

కారంచేడు: సమ సమాజ శ్రేయస్సు కోసం 100 శ్లోకాలతో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు విశ్వంబర నందగిరి స్వామివారు ఉద్బోధించారు. ఆదివారం మండల కేంద్రమైన కారంచేడు హరేరామ ఆశ్రమ గురూజీ ప్రణవానందగిరి స్వామివారి ఆశీస్సులతో ఆశ్రమ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన శ్రీచక్ర సింహాసనావీశ్వరీ త్రిపుర సుందరీ త్రిశక్తి స్వరూపిణీ జ్ఞాన సరస్వతీ అమ్మవారికి సౌందర్యలహరి స్తోత్రములతో విశేష కుంకుమార్చన, పుష్పాలంకరణలు అత్యంత వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైన విశ్వంబరనందగిరి స్వామివారు మాట్లాడుతు విశ్వంలో గతంలో ఎక్కడా జరగని రీతిలో మొదటిసారిగా కారంచేడు హరేరామ ఆశ్రమంలో 100 శ్లోకాలతో అమ్మవారికి విశేష పూజలు నిర్వహించామన్నారు. వందలాదిమంది భక్తులతో అమ్మవారికి ఈ కుంకుమార్చనలు, పుష్పాలంకరణలు నిర్వహించడం ఆశీర్వాదకరమన్నారు. కార్యక్రమంలో కారంచేడు, చీరాల, పర్చూరు మండలాలకు చెందిన అనేక మంది భక్తులు పాల్గొన్నారు.

వైభవంగా మాఘమాసం పూజలు


శివలింగానికి పూజలు చేస్తున్న సాధువులు


1108 పాలరాయి ఏకశిలా లింగాలకు పూజలు చేస్తున్న భక్తులు

బల్లికురవ: మాఘపౌర్ణమి సందర్భంగా ఆదివారం మండలంలోని నక్కబొక్కలపాడు గ్రామ సమీపంలోని ఈర్లగంగమ్మ వద్ద మొక్కులు తీర్చుకునేందుకు వివిధ గ్రామాల నుంచి భక్తులు భారీగా తరలి వచ్చారు. భక్తుల పాలిట కొంగు బంగారంగా విరాజిల్లుతూ కోరిన కోర్కెలు తీర్చుతున్న గంగమ్మ వద్ద చిన్నారులకు పుట్టెంట్రుకలు, అన్నప్రాసనలు చేసుకునేందుకు మండలంతో పాటు వివిధ మండలాల నుంచి కూడా భక్తులు తరలివస్తున్నారు. ఇటీవల కాలంలో గ్రానైట్‌దారులు, నక్కబొక్కలపాడు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అమ్మవారి సన్నిధానం వద్ద విశ్రాంతి భవనం, పుట్టెంట్రుకలు, అన్నప్రాసన చేసుకునే ఏర్పాట్లును చేపట్టారు. పాడి పంటలతో తమను చల్లగా చూడాలని వివిధ గ్రామాల్లోని రైతులు అమ్మవారి వద్ద పొంగళ్లు పెట్టి నివేదించారు.

కొండాయపాలెంలో..

➤ కొండాయపాలెం గ్రామంలో వేంచేసి ఉన్న గంగా పార్వతి సమేత నీలకంఠేశ్వరస్వామి ఆలయంలో మహా రుద్రాభిషేకం కనుల పండువగా, కమీనీయంగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్త ధూళిపాళ్ల రామగోవిందు శివకుమారి దంపతులచే ఆయలంలోకి స్వామివారికి వేద పండితులు, స్వర్ణ లక్ష్మీదీపక్, ఇంకొల్లు సుధీర్‌శర్మలు ఉదయం 5 గంటలకే పంచామృతాలతో అభిషేకాలు, అమ్మవారికి కుంకుమ పూజలు చేపట్టి ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ సన్నిధానంలో 1108 పాలరాయి ఏకశిలా లింగాలతో సహస్ర లింగార్చన చేపట్టారు. రాత్రికి కాశీ క్షేత్రం నుంచి వచ్చిన 60 మంది అఘోరాలచే మట్టి శివలింగ రూపంలో కొలువు దీరునికి రుద్రునికి మహా రుద్రాభిషేకం, మహాభస్మాభిషేకం చేపట్టారు. మండలంతోపాటు వివిధ మండలాల నుంచి రుద్రాభిషేకం చూసేందుకు భక్తులు భారీగా తరలివచ్చారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేపట్టారు.

8న మండల సమావేశం

బల్లికురవ: బల్లికురవ మండల సర్వసభ్య సమావేశం ఈనెల 8 బుధవారం ఉదయం 11 గంటలకు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో సీహెచ్ కృష్ణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ బడుగు శ్రీలక్ష్మీ అధ్యక్షత జరిగే సమావేశంలో శాఖల వారీగా సమీక్షిస్తామని, రాబోయే వేసవి దృష్ట్యా తాగునీటి ఎద్దడులపై చర్చిస్తామన్నారు. ఎంపీటీసీ సభ్యులు సర్పంచ్‌లు, మండల స్థాయి అధికారులు సకాలంలో హాజరు కావాలని ఎంపీడీవో కోరారు.

ఆశ కార్యకర్త పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

మేదరమెట్ల: ఖాళీగా ఉన్న ఆశ కార్యకర్త పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రాసంగులపాడు పీహెచ్‌సీ డాక్టర్ శశికళ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రావినూతల గ్రామంలో దళితవాడలో ఖాళీగా ఉన్న పోస్టుకు పదో తరగతి ఉత్తీర్ణత అయి ఉండి, ఆరోగ్య సమస్యలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. నేటి సాయింత్రం లోగా పీహెచ్‌సీలో దరఖాస్తులు అందించాలని ఆమె కోరారు.

విశ్వకర్మలకు సమాజంలో ప్రత్యేక గుర్తింపు


సమావేశంలో పాల్గొన్న సంఘ సభ్యులు

అద్దంకి రూరల్: కేంద్ర ప్రభుత్వం విశ్వబ్రాహ్మణుల సంక్షేమం కోసం పార్లమెంట్‌లో ప్రధానమంత్రి విశ్వకర్మ కౌశల్‌సమాన్ పథకాన్ని ప్రవేశపెట్టటంతో విశ్వకర్మలకు సమాజంలో ప్రత్యేక గుర్తింపు వచ్చిందని ఉమ్మడి ప్రకాశం జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు చెన్నుపల్లి శ్రీనివాసాచారి అన్నారు. ఆదివారం స్థానిక కమఠేశ్వరస్వామి దేవస్థానంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రధాని నరేంద్రమోదీ, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈసందర్భంగా మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో బాపట్ల జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘం ప్రధాన కార్యదర్శి మునగటి నరసింహాచారి, ప్రచార కార్యదర్శి చేబ్రోలు రవీంద్రా చారి, పట్టణ సంఘధ్యక్షుడు పొన్నపల్లి బ్రహ్మానందం, మురళీ తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయంలో 'చదవటం మాకిష్టం'


పుస్తకాల గురించి వివరిస్తున్న లైబ్రేరియన్

అద్దంకి: చదవటం మాకు ఇష్టం అనే కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో విజ్ఞానం లభిస్తుందని సంతమాగులూరు గ్రంథపాలకుడు బాదం భాస్కరరెడ్డి అన్నారు. గ్రంథాలయంలో ఆయన ఆదివారం చదవటం మాకిష్టం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా లైబ్రేరియన్ మాట్లాడుతూ ప్రతి ఆదివారం కార్యక్రమాన్ని నిర్వహిస్తూ పుస్తక పఠనం గురించి తెలియజేస్తుండటంతో విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారని చెప్పారు.

విద్యోన్నతి స్కాలర్‌షిప్ పరీక్ష


పరీక్షకు హాజరైన విద్యార్థులు

జే.పంగులూరుచినగంజాం: విద్యోన్నతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల్లో 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు, అబ్జెక్టివ్ స్క్రీనింగ్ టెస్ట్ పరీక్ష ఆదివారం మండల కేంద్రమైన పంగులూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగింది. ఈ పరీక్షను మాజీ సర్పంచ్ దూళిపాళ్ల వెంకటేశ్వర్లు, రిటైర్డ్ హెచ్ఎం బొడెంపూడి రామ్మూర్తి జ్ఞాపకార్థం నిర్వహించినట్లు ఫౌండేషన్ నిర్వాహకులు వీరనారాయణ తెలిపారు. 333 మంది పరీక్షకు దరఖాస్తు చేసుకోగా 316 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. మండలాల వారీగా ర్యాంక్ సాధించిన మొదటి 15 మంది విద్యార్థులకు మండలానికి ఐదుగురు చొప్పున మూడు మండలాలకు కలిపి 15 మంది విద్యార్థులకు ఒక్కొక్కరికి ఏడాదికి రూ.10 వేలు రెండేళ్లపాటు అందిస్తామని తెలిపారు. పంగులూరులో జరిగిన పరీక్షలు 69 మంది విద్యార్థులు హాజరైనట్లు తెలిపారు. కార్యక్రమంలో ఫౌండేషన్ వలంటీర్లుగా హైస్కూల్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైభవంగా లక్ష తమలపాకుల పూజ


తమలపాకులతో పూజ నిర్వహిస్తున్న అర్చకులు

అద్దంకి రూరల్: ప్రముఖ పుణ్యక్షేత్రమైన శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామికి పౌర్ణమి సందర్భంగా ఆదివారం లక్ష తమలపాకుల పూజ అత్యంత వైభవంగా నిర్వహించారు. దీనిలో భాగంగా ప్రాతఃకాల సుప్రబాత సేవ, గోపూజ, బిందెతీర్థం అనంతరం వేదపండితులు, అర్చకులు, ఉభయ దాతలు వేదస్వస్తి మంగళ వాయిద్యాలతో ఆలయ ప్రదక్షిణలు చేసి వినాయక స్వామికి, సుబ్రమణ్య స్వామికి, జీవధ్వజ ఉష్ట్రవాహనానికి నారీకేళ సమర్పణ చేశారు. గణపతి పూజ, ఋత్విక్వరుణ తరువాత 11 ఆవృత్తాలుగా లక్ష తమలపాలకులతో పూజ నిర్వహించారు. కార్యక్రమానికి ఉభయదాతలు అద్దంకికి చెందిన మానికొండ నాగేశ్వరరావు దంపతులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ఐక్య పోరాటాలతోనే సమస్యల పరిష్కారం

సీఎస్‌పురం: ఐక్య పోరాటాలతోనే కార్మికుల సమస్యలకు పరిష్కారం దొరుకుతుందని సీఐటీయూ జిల్లా మాజీ నాయకుడు సయ్యద్ హనీఫ్ అన్నారు. సీఐటీయూ 5వ మండల మహాసభ మండల కార్యదర్శి ఎస్ తిరుపతిరెడ్డి అధ్యక్షతన ఆదివారం స్థానిక బస్టాండ్ సెంటర్లో నిర్వహించారు. సీఐటీయూ అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో స్థానిక శివాలయం వద్ద నుంచి బస్టాండ్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో హనీఫ్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ కార్పొరేట్ సంస్థలకు లబ్ధి చేకూర్చేలా ఉందని సామాన్య ప్రజలకు ఎటువంటి ఉపయోగం లేదన్నారు. నడికుడి శ్రీకాళహస్తి రైల్వేలైన్, నిమ్జ్, దొనకొండ కారిడార్ తదితరాలకు ఒక్క రూపాయి కూడా కేటాయించలేదని, రాష్ట్రానికి ప్రత్యేక హోదా, విభజన హామీల సాధన కోసం కలిసికట్టుగా పోరాటం చేయాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం స్థానిక వడ్డెపాలెం ప్రాథమిక పాఠశాల ఆవరణలో సీఐటీయూ ప్రతినిధుల సభ ఏసురత్న అధ్యక్షతన జరిగింది. సీఐటీయూ జిల్లా కార్యదర్శి రమేష్, ఆశవర్కర్స్ జిల్లా అధ్యక్షురాలు రాఘవమ్మ, ఐద్వా జిల్లా నాయకురాలు ఊసా రాజ్యలక్ష్మి, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ఊసా వెంకటేశ్వర్లు మాట్లాడారు.

ఆలయ పునఃనిర్మాణానికి విరాళం

కందుకూరు అర్బన్: పట్టణంలోని అంకమ్మతల్లి దేవాలయం పునఃనిర్మాణానికి సన్నపరెడ్డి నారపరెడ్డి రూ.30,832 విరాళం అందజేశారు. అమ్మవార పాదాల చెంత బంగారు యంత్రానికి ముచ్చు వేణు ధర్మపత్ని సుజాత రూ.5,544 ఆలయ పునఃనిర్మాణ కమిటీ సభ్యులకు అందజేశారు. ఆలయ కమిటీ సభ్యులు వెంకటరెడ్డి, మాల్యాద్రి, ఆవుల మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

పేదల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయం


సంక్షేమ కరపత్రం ఇస్తున్న కరణం వెంటేష్

● నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్

వేటపాలెం: రాష్ట్రంలో పేదల అభ్యున్నతే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తుందని చీరాల నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి కరణం వెంకటేష్ పేర్కొన్నారు. వేటపాలెం మండలం పరిధిలో వేటపాలెం సచివాలయం-3 పరిధిలోని గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. అధికారులు, నాయకులతో కలసి ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాలను తెలిపారు. పథకాలు అందుతున్నాయా లేదా అడిగి తెలుసుకున్నారు. సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులకు సూచించారు. వార్డులో ఎటువంటి సమస్యలు ఉన్నా తమను నేరుగా కలసి చెప్పవచ్చని సూచించారు. సమస్యలను వెంటనే పరిష్కరిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల అభ్యున్నతి కోసం సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అనే సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారని అన్నారు. కార్యక్రమంలో ఏపీఎం శ్రీనివాసులు, సెక్రటరీ హరిబాబు, మాజీ సర్పంచ్‌లు మున్నంగి అరుణ్‌కుమార్, కట్టా గంగయ్య, ఆర్‌బీకే చైర్మన్ పల్లపోలు శ్రీనివాసరావు, అందే కృష్ణ, జిడుగు మస్తాన్, షకీల్, షమీమ్, కట్టా జార్జి సామ్యూల్, పృథ్వీ చంద్రమోహన్, ఖాదర్, మ్యాథ్యూస్, కరణం మురళీ, ఖజ్జీ, నూర్, జిమ్మిప్రసాద్ రెడ్డి, మస్తాన్, అందే రాజేష్, అందే శ్రీను, రాఘవ, కార్యకర్తలు పాల్గొన్నారు.

కమనీయం మదనగోపాలుడి కల్యాణం


వేటపాలెం: స్వామి వారికి పూజలు చేస్తున్న కరణం వెంకటేష్


పేరాలలో మదనగోపాలస్వామి కళ్యాణోత్సవాన్ని నిర్వహిస్తున్న దృశ్యం

చీరాల అర్బన్: పట్టణంలోని పేరాలలో వేంచేసి ఉన్న రుక్మిణి సత్యభామా సమేత మదనగోపాల స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి స్వామివారి కళ్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వైఖానసాగమన ప్రకారంగా త్రయాహ్నిక దీక్షతో స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నారు. కల్యాణోత్సవాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. కల్యాణాన్ని యాజ్ఞికులు తమిరిశ వంశీకృష్ణ నిర్వహించారు. పూజా కార్యక్రమాలను అర్చకులు ఆర్.వి.రంగాచార్యులు నిర్వహించగా ఆలయ 14వ ధర్మకర్తలు జక్కా రమేష్, డాక్టర్ జక్కా మోహన మురళీధరరావులు హాజరయ్యారు. కల్యాణోత్సవ కార్యక్రమాలను ఆలయ మేనేజర్ టివి శివనాగదాసు పర్యవేక్షించారు. బ్రహ్మోత్సవాలు సందర్భంగా భక్తులు పాల్గొని స్వామివార్లను దర్శించుకున్నారు.

పందిళ్లపల్లిలో..

వేటపాలెం: మండల పరిధిలోని పందిళ్లపల్లి గ్రామంలో వేంచేసియున్న వేణుగోపాలస్వామి వారి దేవస్థానం ప్రాంగణలో స్వామి వారి శాంతి కల్యాణ మహోత్సవం ఆదివారం కన్నుల పండువగా పండితులు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పోలకం వెంకట సురేష్ కుమార్, వెంకట నాగమల్లేశ్వరి పీటలపై కూర్చొని స్వామి వారి కళ్యాణ మహోత్సవం కార్యక్రమాలు నిర్వహించారు. నియోజకవర్గ ఇన్‌చార్జ్ కరణం వెంకటేష్ స్వామి వారి కల్యాణ మహోత్సవానికి హాజరై స్వామిని దర్శించుకొని పూజలు చేశారు. వీరి వెంట పీఏసీఎస్ అధ్యక్షులు పల్లపోలు శ్రీనివాసరావు, ఆలయ కమిటీ సభ్యులు పొగడదండ రవికుమార్ ఉన్నారు.

క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతానికి కృషి


సమావేశంలో మాట్లాడుతున్న భరత్

యద్దనపూడి: రాష్ట్రంలో మునుపెన్నడూ కనీవినీ ఎరుగని విధంగా అమలవుతున్న సంక్షేమాభివృద్ధికి తోడూ పార్టీ కార్యకర్తలందరూ సమష్టిగా పనిచేస్తే వచ్చే ఎన్నికల్లో పార్టీ గెలుపు మరింత సులువుతుందని వైఎస్సార్ సీపీ నాయకుడు గొట్టిపాటి భరత్ అన్నారు. ఆదివారం రాత్రి మండల కేంద్రమైన యద్దనపూడిలో రావూరి వేణుబాబు ఆధ్వర్యంలో ఆయా గ్రామాల నాయకులు, కార్యకర్తలతో మండలస్థాయి ఆత్మీయ సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన గొట్టిపాటి భరత్ మాట్లాడుతూ గత టీడీపీ హాయంలో జరిగిన అవినీతి, అక్రమాలను ప్రజలకు వివరించటంతో పాటు సీఎం జగన్ మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన నవరత్నాల పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. ఇందులో భాగంగా ప్రతి 50 ఇళ్లకు ఇద్దరు చొప్పున గృహసారథులను ప్రభుత్వం నియమిస్తున్నట్లు తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు అందరూ విభేదాలను, భేదాభిప్రాయాలను పక్కన పెట్టి ఆమంచి కృష్ణమోహన్ గెలుపు కోసం కృషిచేయాలన్నారు. పార్టీలు, కులాలు, మతాలు చూడకుండా ప్రతి పేదవానికి సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ చుండి లక్ష్మినారాయణమ్మ, మండల కన్వీనర్ షేక్ శ్రీనివాసరావు, గ్రామసర్పంచ్ వల్లేరు రేణుక, బాల కోటేశ్వరావు, ఎంపీటీసీ ఖాసింవలి, మువ్వల రాంబాబు, మానుకొండ శ్రీనివాసరెడ్డి, కోడూరి నాగరాజు, రావు రంగారావు, తనుబొద్ది వీరారెడ్డి, కొరిటాల సుబ్బారావు, దుగ్గినేని కోటేశ్వరావు, గనిపిశెట్టి వెంకట్రావు, మార్నెళ్ల శ్రీధర్, వేమన సాంబయ్య, గడ్డం హనుమంతురావు, ఆయా గ్రామాల పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జనార్దనస్వామి కల్యాణ మహోత్సవంలో ఆమంచి

చినగంజాం: ఇంకొల్లు మండలంలోని పూసపాడు గ్రామంలో వేంచేసియున్న శ్రీదేవి, భూదేవి సమేత జనార్ధన స్వామి ఆలయంలో ఆదివారం రాత్రి నిర్వహించిన కల్యాణ మహోత్సవం కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆమంచి కృష్ణమోహన్ పాల్గొన్నారు. ఆలయ సంప్రదాయం ప్రకారం ఆలయ అర్చకులు ఆయనకు స్వాగతం పలికారు. సంప్రదాయ బద్ధంగా పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులతో పాటు పూసపాడు గ్రామ వైస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు ఆయనకు ఘన స్వాగతం పలికారు.